# 4

## సుడిగుండం

రెండు వేర్వేరు నదులు సమాంతరంగా ప్రవహిస్తూవచ్చి, సాగరంతో సంగమించే చోట ఒకదానితో ఒకటి కలసిపోయినట్టుగా జానకి చెబుతూ వచ్చిన 'చంద్రం బావ' కథా, ఉద్యోగ జీవితంలోనా కెరుకపడుతూవచ్చిన శేఖరంగారి వృత్తాంతమూ ఒకదానితో ఒకటి పెనవేసుకొని చివరకు గతంలో లీనమై మాటుమణిగిపోయాయి. పోగా చెప్పుకోడానికొక్క కథమాత్రం మిగిలింది.

ఒకానొక సామూహిక ఛాయాచిత్రంలో చంద్రాన్ని చూడటమైతే జరిగిందిగాని. ఆ ఫోటో పదిహేనేళ్ళనాటిది. బాల్యాన్ని అధిగమించి, యౌవనంలో కాలు బెడ్తున్న చంద్రం సన్నగా, పొడుగ్గా కళ్ళల్లో కాంతులు నింపుకుని చిరునవ్వును మరీ అంత స్వేచ్ఛగా పారిపోకుండా పెదవుల చివళ్ళలో త్రొక్కిపట్టి వెలుగుతూ వెలుగుతూ వున్నకాకరపువ్వొత్తిలా కనిపించాడు.ఆ చూపులేవో ప్రగల్భ భావాన్ని వెలార్చుతున్నాయి. కొంచెంగా కుంచించుకపోయిన కనుబొమలు మనిషిలోని ఆలోచననూ, నిశ్చలత్వాన్నీ లీలగా ప్రకటిస్తున్నాయి. ఆ యీ విశేషాలతో ఆ ఆకృతి చాలా బాగున్నమాట నిజమే! కాని ఎంత బాగున్నా అది ఫోటోకోసం పెట్టిన పోజు మాత్రం కాకపోదు. పార్సెలు అందచందాలను బట్టి లోలోపలి వస్తువుకు విలువ కట్టడం సమంజసం కాకపోవడం అటుండగా ఒక్కొక్కప్పుడు హాస్యాస్పదం గూడా కావచ్చు.

క్రొత్తకాపురం ప్రారంభమైన తొలిరోజుల్లో ఓ మిట్ట మధ్యాహ్నం. గదిలో పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాను. జానకి గడపదగ్గర నిల్చుని ఎవరితోనో మాట్లాడుతోంది.

ఒకటి రెండు నిమిషాలపాటు విన్న తర్వాత అవతలి వ్యక్తి ఎవరో పోల్చుకో గలిగాను. అతడు చౌకరకం మిఠాయివుండలు అమ్ముకునే ముక్కాలి ముదుసలి. బండలాంటి బట్టతలకు ఓ తుండు గుడ్డ చుట్టుకుని, రిపేర్లతో తలమునకలైన చెప్పుల్లోనుంచి పాదాలను ఈడ్చుకుంటూ వీథులవెంట తిరిగే ఆ మిఠాయి బేరగాడు బహుశా ఎండ దెబ్బకు తట్టుకోలేక తన బడుగుదేహాన్ని వసారాలోకి చేరవేశా డేమో! అతడిపైన ప్రశ్నలవర్షం కురిపిస్తోంది జానకి. 'నీకు బిడ్డలు లేరూ? వాళ్ళు సంపాదించడంలేదూ? నీకు పూటకు పట్టెడన్నం పెట్టలేరూ?'

అప్పటికి నేనింకా జానకిని అర్థం చేసుకునే స్థితిలోనేవున్నాను. జీవిత యాత్రలో కష్టనష్టాలను చవిచూచి, ఢక్కా మొక్కీలు తిన్న తర్వాతగానీ మానవునికి విషాదోదంతాలు వినాలన్న ఆసక్తీ, వినేపాటి గుండె నిబ్బరమూ సమకూరవు. ఎదురింటావిడ కట్టుకున్న కొత్త చీరపట్లగానీ జానకి తన కుతూహలాన్ని వ్యక్తపరచివుంచే నా కంత ఆశ్చర్యం కలిగివుండేదికాదు.

నిద్రలేచిన తర్వాత "ముసలాడితో యింటర్వ్యూ ముగిసిందా జానకీ!" అన్నాను.

జానకి ఉలికిపడ్డట్టు తల పైకెత్తింది. అల్లల్లాడుతున్న రెప్పల క్రింద కనుపాపలు సంచలించిపోతుండగా "ఈవూరి కొచ్చినప్పటి నుంచీ ప్రతిరోజూ ఆ ముసలాణ్ణి చూస్తున్నానండీ! అతణ్ణి చూసినప్పు డల్లా నాకు మా పెద్దమామయ్య జ్ఞప్తికి వస్తాడు" అంది.

"ఆయన గూడా యిలాగే మిఠాయి వుండలు అమ్ముకుంటా డేమిటి?"

"మిఠాయి వుండలు కావనుకోండి. ఆయన నీళ్ళ కావిళ్ళు మోశాడు.ఆ తరువాత ఒంటెద్దు బండిపైన పీపావేసుకుని మంచినీళ్ళు

తెచ్చి హోటళ్ళకు పోశాడు. పూరిల్లున్న చోట పెంకుటిల్లు వేశాడు. తనూ పస్తులున్నాడు; అత్తయ్యనీ పస్తులు పెట్టాడు. చిక్కి శల్యమయ్యాడు. ఒకనాడు కానీకి టికాణాలేనివాడు కొడుకుని కాలేజీలో చేర్చాలంటే అందుకోసం అత డెన్ని పాట్లు పడ్డాడో వివరంగా చెప్పక్కర్లేదు. చంద్రం బావ చదువుకుంటే తన కష్టాలు గట్టెక్కుతాయనీ, చదువు కొని ప్రయోజకుడైతే అతడే తన తమ్ముళ్ళ కిద్దరికీ ఓ దోవ చూపిస్తాడనీ, కడగొట్టు పిల్లని ఓ అయ్యచేతికి పట్టిచ్చే పూచీగూడా అతనిదేననీ ఆయన కలలు గన్నాడు. కాని కలలన్నీ కల్లలే గదండీ! డిగ్రీ పుచ్చుకొని యింటికి రాబోతుండగా చంద్రం బావను గ్రద్దో, కాకపోతే గరుడపక్షో - ఏమిటో మరి, అది - అమాంతంగా తన్నుకెళ్ళిపోయింది...."

"గ్రద్ద తన్నుకపోడమే! మీ చంద్రం బావను! అసలు సంగతేమిటి జానకీ?" అన్నాను.

గ్రద్దంటే గ్రద్దేకాదు. ఎవరో మహారాజులు! చీర సెలెక్షను కోసం బట్టలంగడిలో జొరబడ్డట్టు కాలేజిపైన పడ్డారు. గాలించారు. చంద్రం బావను ఎన్నికచేశారు. తీసుకెళ్ళి ఆ శుభకార్యం కాస్తా జరిపించేశారు. అతడి చుట్టూ గిరిగీసేశారు. అంతే మరి! అప్పటినుంచీ చంద్రం బావ ఆ కనిపించని కోటలోనే వుండిపోయాడు. ఆకోట గోడదాటి ఈవలికి రాలేకపోయాడు...."

కాసేపాగి మళ్ళీ చెప్పుక పోసాగింది జానకి. "మా పెద్ద మామయ్య గతి మళ్ళీ మొదటికే వచ్చింది. అత్తయ్య మళ్ళీ పస్తులు మాడింది. కూతురిపెళ్ళితో ఆ వున్న పెంకుటిల్లు గూడా వూడ్చుకపోయింది. తీరామారా హైస్కూలు చదువుకూడా కొనసాగక కుర్రాళ్లిద్దరూ దేశాలపాలయ్యారు. ఆ దిగులుతో అత్తయ్య మంచ మెక్కి ఆఖరుశ్వాస వదిలేసింది. చివరకు మామయ్య కొమ్మలులేని మ్రోడులా మిగిలిపోయాడు...." వేడిగా నిట్టూర్చి మౌనంగా కూర్చుంది జానకి.

పోనీలే జానకీ! ఏనాడో జరిగిపోయిందానికి యిప్పుడు దిగులు పడడమెందుకు? లోకమంతా ఒక్కతీరుగా వుండదు. కొందరు

లేనిపోని బాదరబందీలన్నీ కొనితెచ్చుకుని నలిగి నజ్జుగుజ్జయి పోతారు. మరికొందరు వున్నవాటిని గూడా వదలుకుని రెక్కలు గట్టుకుని పారి పోతారు. పెందలకడనే నిద్రలేచి పాఠాలు శ్రద్ధగా చదువుకుని వేళకు సరిగా బడికి వెళ్ళే మంచి కుర్రవాళ్ళే వుంటారా ప్రపంచంలో! ఐనా కాటికి కాళ్ళు జాచుకున్న మీ పెద్ద మామయ్యకు యికపైన కొత్తగా రాబోయే కష్టాలేమున్నాయి గనుక! ఓపినంత జీవితాన్ని ముందుంచుకున్న మీ చంద్రంబావైనా హాయిగా, ఆనందంగా బ్రతుకు తున్నాడు. మన కంతే చాలు! ఎవరి అదృష్టం వాళ్ళది!"

"అదేమిటండీ! అలాగనేశారు! అదృష్టవంతులందరూ యెవరి అదృష్టం వాళ్ళదే ననుకుంటే లోకంలో చాలామంది ఈ మోస్తరుగా నైనా బ్రతకడానికి వీలుండేది గాదేమో!"

సమస్త పీడితవర్గం తరఫునా వకాలత్తు పుచ్చుకున్న దానిలా నిలదీసి అడుగుతోంది జానకి. ఆమె వాదం తేలికమాటలతో త్రోసి వేయ దగినంత నిస్సారమైంది గాదు. ఆ పరిస్థితిలో ప్రసంగాన్ని ఓ కొలిక్కితెచ్చి జానకితో సమాధాన పడడంకన్నా ఉపాయాంతరం తోచింది గాదు.

"అవును జానకీ! నాలుకకు ఎముకెక్కడుంది? దానితో ఎలా గైనా మాట్లాడొచ్చు మరి!" అంటూ నవ్వేశాను.

ఒక్క మిఠాయి తాతలోనేగాదు. ఎక్కడైతే దుర్భరమైన యాతన మానవుణ్ణి క్రుంగదీస్తోందో, ఎక్కడైతే దుస్సహమైన వేదన మనిషిని అంతరాంతరాల్లోనుంచీ కాల్చుక తింటోందో అక్కడల్లా జానకికి తన పెద్దమామయ్యే కనిపించేవాడు. ఆ అభాగ్యుణ్ణి గురించి తలచుకున్నప్పుడల్లా ఆమె చంద్రాన్ని గురించిన ప్రసక్తిని తేకుండా వుండలేకపోయేది.

తనంతట తనకే బుద్ధి పుట్టినప్పుడు శిష్యునికి ఓ నిగూఢ విషయం బోధించే గురువులా అడపాదడపా జానకి చెబుతూ వచ్చింది గానీ లేకుంటే చంద్రాన్ని గురించి చెప్పడానికి నా కేమీ తెలిసి వుండేదిగాదు. చంద్రం జానకికి మేనమామ కొడుకు. ఐనా నా కతడేమీ

కాదు. ఎన్నడూ ముఖపరిచయమైనా లేని ఒక మానవునిపట్ల ఆత్మీయతనుగానీ, వైముఖ్యాన్నిగానీ పెంచుకోవలసిన అవసరమేమీ నాకు కనిపించలేదు.

కాని శేఖరంగారితో నా పరిచయం అలాంటిదిగాదు. సుడిగాలిలా నా ఉద్యోగ జీవితంలో ప్రవేశించిన ఉన్నతోద్యోగి శేఖరంగారు. 'అమ్మో, నిప్పులాంటి మనిషి'—'అబ్బే, ఎలాంటి పనికైనా వెనుదీయని ఘటం' అంటూ పరస్పర విరుద్ధంగా పడుగూ పేకగా అల్లుకపోయిన ఊహాగానాల తెర వున్నట్టుండి పైకి లేచింది. పెడదారివెంట పరుగెత్తీ పరుగెత్తీ పొరబాటు తెలిసిరాగానే ఆగిపోయి వెనుదిరిగి వెళ్ళడానికీ మనస్కరించక, ముందుకు వెళ్ళడానికీ సాహసంలేక యిసుక తుపానులో చిక్కి బిక్కుబిక్కుమంటున్న ఎడారి ప్రయాణీకునిలా చిత్రంగా కనిపించారు శేఖరంగారు. ఆఫీసులో వున్నంతసేపూ ఆయన క్రింది వుద్యోగులను ముళ్ళపైన కూర్చోబెట్టేవారు. పీక నొక్కుతున్న తొందర పనులన్నింటినీ ఓ మూలకునెట్టి హఠాత్తుగా ఓ ఫైలుకోసం కేకపెట్టేవారు. తీరా ఆ ఫైలును సముఖానికి తీసుకెళ్ళేసరికి, అదిగాదు వేరొకటి తెమ్మనేవారు. ఎక్కడి కాగితాల నక్కడే పడవేసి, అవసరం వచ్చినప్పుడు వాటికోసం రికార్డు బాక్సు లన్నింటినీ తిరగ బోర్లించేవారు. ఆయనకు పనిచేసేవాళ్లెవరో తెలియదు. బద్ధకించేవాళ్లెవరో తెలియదు. తన కోపాగ్నికి యింధనంగా తలమాసినవా డొకడు దొరకడమే ఆయనకు కావలసింది! దారితప్పి కొత్త అడివిలోకివచ్చిన ముప్పన్నెమెకం దిక్కులు తోచక అలా రొప్పుతుందేమో! ఆఫీసుచుట్టూ ఎర్రటి ఎండల్ని పరపి, వేడెక్కించిగానీ గాలిని సైతం లోపలికి వదలకుండా, రాతిగోడల మధ్య కూర్చున్న సర్కారు సిబ్బందికి సలక్షణంగా ఉష్ణోపచారాలు నెరపే చండమార్తాండుడే ఒక చుట్టు మేలు! ఆయన పడమటి జాము ప్రొద్దుకైనా చల్లబడిపోతాడు.

శేఖరంగారు బాగా పొడుగరి. స్థూలం కాదుగాని సొరకాయలా జజ్జుబారిన శరీరం ఆయనది. అదేం విచిత్రమోగాని ఆ దేహం తమ

దన్న స్పృహగూడా ఆయన కుండేదిగాదు. రోజుల తరబడి సంస్కా రానికి నోచుకోని క్రాపింగుతో, నలిగి మాసిపోయిన దుస్తులతో ఏదో మందకొడితనం గూడుకట్టుకున్న ముఖంతో, అప్పుడే నిద్రపడక నుంచి లేచినట్టుగా ఆయన ఆఫీసుకు వచ్చేసేవారు. బాహ్యలక్షణాలను బట్టి చూచినట్టయితే ఆయన ఏదో అనారోగ్యంతో నానాటికీ నీరసించి పోతున్నట్టు తోచేది. అందుకు తోడు అనవసరమైన కోపం, చిరాకు, ఆందోళన—యివన్నీకలిసి ఒక మానసిక రుగ్మతగా రూపొంది ఆయ నను తహతహ లాడించేసేవి.

"ఇదంతా ఉన్మాదంలో ప్రాథమిక దశలా కనిపించడం లేదట్రా రాజూ!" అన్నాడు తోడిగుమాస్తా రాఘవేంద్రం ఒక్కసారి.

ఆ వూహ తాకిడికి నేనొకటి రెండుక్షణాలు మ్రాన్పడి పోయాను. కాని అదొక గొప్ప విశేషమే కానట్టు అటెండరు చల మయ్య రాఘవేంద్రంతో శ్రుతి కలిపేశాడు.

"మెల్లగా అంటున్నారా బాబూ ఆమాట! ఆ చూపులే మనిషి చూపుల్లా వుండటం లేదంటే, మరేమనుకోమంటారు? మాటి మాటికీ బుర్రగోక్కోడం, వ్రాస్తూ వ్రాస్తూ కలం టేబిల్‌పైనవుంచి నిట్టూ రుస్తూ కుర్చీలో చేరగిలబడిపోడం, తలపగిలిపోతున్నదేమో నన్న ట్టుగా కణతల్ని రెండుచేతుల్తోనూ అదిమి పట్టుకోడం....ఒకటా, రెండా, ఎన్ని విడ్డూరాలు! నేననుకునేదేమిటంటే రాఘవేంద్రం గారూ, ఈ మనిషి కెవరిపైనోగానీ తీరని కసివున్నట్టుంది. ఆ కసిని చల్లార్చుకునే దోవలేక, ఈయన సంకెళ్ళలో తగులుకున్న వాడిలా యిలా తల్లడిల్లిపోతున్నాడు...."

ఆఫీసులోపలా, బయటా యిలాటి అభిప్రాయాలు కార్చిచ్చులా రగులుకోసాగాయి. ఆ చిచ్చు మరింత తీవ్రంగా వ్యాప్తం కావడానికి వీలుగా ఓ రోజు సాయంత్రం ఆఫీసులో ఓ అపూర్వమైన సంఘటన జరిగింది.

ఆ రోజు వుదయంనుంచీ శేఖరంగారు మరీ బీభత్సంగా చిందులు ద్రొక్కేస్తున్నారు. గదిలోని కాలింగ్ బెల్ సరాసరి అయిదునిమిషాల

కొకసారి మ్రోగుతోంది. ఆ మ్రోత చెవిలో చేరుకున్న జోరీగ సంగీతంలా నినదించడంతో ఏ గుమస్తా ముఖంలో చూచినా కలవరపాటు ప్రస్ఫుటంగా గోచరమౌతోంది. లేదంటే ఒకటి రెండు దశాబ్దాల అనుభవంలో లెక్కలేనన్ని ఆటుపోట్లకు తట్టుకున్న పాతపులులు మాత్రం నిశ్చింతగా తమ పనేదో తాము చేసుకపోతున్నారు. అలాంటి కొందరిలో ఒక్కడైన నరసింహంకోసం జవాను పుల్లయ్య పరతెంచి వచ్చాడు.

"బాబ్బాబూ! త్వరగా లేవాలి. అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు.

"అదేమిటయ్యా పుల్లయ్యా! అక్కడేమయినా శుభముహూర్తానికి వేళ మీరిపోతుందా?" అన్నాడు నింపాదిగా నరసింహం.

"అబ్బే, అదికాదు బాబూ! మిమ్మల్ని గనుక క్షణాల్లో హాజరు పరచకపోతే ఆయన నాపైన విరుచుక పడతారు...."

"అవున్లే. నాకు తెలుసుకానీ, నువ్వెళ్ళు. వెళ్ళి, వస్తున్నానని చెప్పు." అంటూ నరసింహం మళ్ళీ తన పనిలో లీనమైపోయాడు.

ఆఫీసు ఆఫీసంతా నరసింహం గుండె నిబ్బరానికి విస్తుపోయింది. ఆఫీసరుగారి ఆగ్రహాన్ని నరకంగానూ, అనుగ్రహాన్ని స్వర్గంగానూ భావించే వారికి అతడిగుండె దిటవు తెంపరితనంగా గూడా కనిపించింది. నిజానికి నరసింహం అదొక తరహా మనిషి. మనిషి మనిషికీ ఒక ముద్దుపేరు పెట్టే రాఘవేంద్రం పరిభాషలో అతడు 'సాధుగర్వి.' నిప్పును గప్పుకొన్న నివురులాంటి ఆ సాధుత్వం గట్టిగా గాలివీస్తే గుప్పున ఎగిరిపోతుంది. అప్పుడతడు నరసింహం కాదు! ఖణిల్లున రంకెవేస్తూ పైకొచ్చే పోట్ల ఎద్దు! ఆ క్షణాన అతడి నోటివెంట ఎలాటి మాటలైనా దొర్లిపోవచ్చు, ఎలాంటి కాని పనికైనా అతడు పూనుకోవచ్చు!

కళ్ళజోడు తీసి జేబులో వుంచుకుంటూ పైకి లేచాడు నరసింహం. గోదాలోకి నడుస్తున్న మల్లయుద్ధవీరునిలా అంగలుసాచి వేస్తూ, చేతులూపుకుంటూ తాశీల్దారుగారి గదిలో ప్రవేశించాడు.

ఈ నరసింహం వేళదప్పి ఆలస్యంగా మృగరాజు ఎదుటకు వెళ్తున్న చెవులపిల్లి! ఇతడి గతి ఏమౌతుంది? పైకప్పు విరిగి తల పైన పడుతుందా? భూదేవి పగిలి యితణ్ణి తనలోపలికి చేరదీసుకుంటుందా? పరిణామం ఎలాగుందోనన్న ఉత్కంఠ ఆఫీసు వాతావరణంలో సుళ్ళు తిరుగుతోంది.

అందరూ అనుకున్నట్టుగానే గదిలోనుంచి ఫెళఫెళారావంతో వురుము వినిపించింది. "ఇర్రెగులర్. యిర్రెస్పాన్సిబుల్! డ్యూటీ అంటే యింత నిర్లక్ష్యమా! ఏమి టీ డ్రాఫ్టు? ఇదీ వొక వ్రాతేనా? మళ్ళీ పేరుకు యూ. డీ. సీ. లు. పాతపందికొక్కుల్లా...."

ఇంతవరకూ వినిపించిందేమో తాశీల్దారుగారి కంఠం. ఆ తరువాత ఓ గావుకేక వినిపించింది. అచ్చంగా అది కేకగూడా కాదు. సింహనాదం!

సభ్యత అసిధారావ్రతంగా పాటింపవలసిన ఉద్యోగ విధుల్లో ఒక్కటి. కాని తననుతానే మరచినప్పుడు ఉద్యోగవిధు లెక్కడ జ్ఞాపకం వుంటాయి? రెప్పపాటు కాలంలో హాల్లోని కుర్చీలన్నీ ఖాళీ అయిపోయాయి. గదిలోపలి దృశ్యాన్ని చూడడానికి అనువుగా గుమాస్తాలు, బిళ్ళబంట్రోతులు, అటెండర్లూ రెక్క తలుపులచాటునా, కిటికీల దాపునా మూగిపోయారు.

ఖాళీ కుర్చీకి చేతులానించి టేబిలుపైకి వంగి నిల్చున్నాడు నరసింహం. అతని కళ్ళు కొలిమిలో నిప్పుల్లా కణకణలాడి పోతున్నాయి. ముఖాన వువ్వెత్తుగా లేచిన నరాలలో రక్తప్రవాహంతాలూకు ఉద్ధృతానికి అతడి ఉత్తమాంగం చలించిపోతోంది.

దెయ్యం ఆవేశించిన వాడిలా నిలువునా వూగిసలాడిపోతున్న నరసింహం ఎదుట శేఖరంగారు శరీరాన్నంతా కుర్చీలోకి కుంచించుకుని కూర్చున్నారు. ఆ ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. నుదుట గుప్పుగుప్పున చెమట పట్టిపోతుండగా, కళ్ళల్లో భయం తొంగి చూస్తుండగా ఆయన వడగాడ్పులో ఎండుటాకులా గిలగిలలాడిపోతున్నాడు.

ఎలాగైతేనేం అంతకుమించిన అగాయిత్య మేమీ జరగలేదు గనుక ఆరోజు ఆఫీసు నిద్ర లేచినవేళ మంచిదనే అనుకోవలసి వచ్చింది. మంచుగడ్డలా బిగుసుకుపోయిన ముఖంతో విగ్రహంలా తిరిగివచ్చి నరసింహం తన సీటులో కూర్చున్నాడు.

కాళీయమర్దన,దక్షయజ్ఞ విధ్వంసాలతర్వాత ఆ లిస్టులోచేర్చుకో దగిన సాహసకార్యం చేసినందుకు నరసింహాన్ని అభినందించాలన్న కుతూహలం సహోద్యోగులందరికీ కలిగింది! కాని ఆ ఉగ్ర నారసింహ స్వరూపాన్నిసమీపించే ధైర్యంమాత్రం ఎవరికీ లేకపోయింది.ఆఖరుకు నాటకరంగంపైన స్త్రీ పాత్రలు ధరించడం ద్వారా జవరాళ్ళ పోకిళ్ళను కొంతవరకూ ఒంటబట్టించుకున్న రాఘవేంద్రం అభినవ చెంచులక్ష్మి పాత్రకు ఒప్పింపబడ్డాడు. ప్రొద్దు బాగా వాటారిన తర్వాత కాంటీను లోకి వెళ్ళి కూర్చున్న నరసింహానికి అతడు పుట్టతేనెకు బదులుగా గ్లాసునిండా శీతల పానీయాన్ని సమర్పించుకుంటూ, "గుమాస్తాగా పేర్కొనబడుతున్న మానవునికి కూడా మానం, మర్యాదా వుంటా యని ఋజువు చేశారు నరసింహంగారూ! స్థాపుతరపున సౌహార్ద మైన అభినందనలు స్వీకరించండి" అన్నాడు.

నరసింహం ఒక్కగుక్కలో కూల్‌డ్రింకును మటుమాయం చేసి, సుదీర్ఘంగా ఓ వెడనవ్వు నవ్వి ఆ తరువాత నిమ్మళంగా ప్రారంభించాడు—

"అది కాదయ్యా రాఘవేంద్రం! ఎంత తను తాశీల్దారైతే మటుకు యింత మిడిమేలమా! అతగాడి వికటనృత్యాలకు ఆఫీసు రంగస్థలమా? అతడి బెదిరింపుల దుమారానికి తల ఒగ్గి కుక్కిన పేలుగా పడివుంటారా మీరు? అహఁ, నేను మిమ్మల్ని సూటిగా ప్రశ్ని స్తున్నాను. మీరు మనుష్యులు కాదూ?"

"ఐతేమటుకు మేము చేయగలిగిం దేముంది నరసింహం గారూ! పురుషులందు పుణ్యపురుషులు వేరైనట్టు పౌరుషం కలిగిన వాళ్ళుగూడా వేరేగదూ?" అన్నాడు రాఘవేంద్రం!

నరసింహం స్థాయి హెచ్చించాడు. "చూడు రాఘవేంద్రం!

మీ రిలా పిరికి మందు త్రాగి బ్రతుకుతుండబట్టే అతగా డిలా నెత్తిపై కెక్కి కూర్చుంటున్నాడు. అయ్యగారు తన దొరతనం కలకాలం యిలాగే సాగుతుందని కలలు కంటున్నారేమో! అదేం జరగదు. ఇతడి బండారమంతా మన గుప్పిట్లో వుంది. ఈయనగారు కాపరముంటున్న మేడకు అద్దెంతో తెలుసా? అరవై అయిదు రూపాయలు. ఈయనకు నలుగురు బిడ్డలు. వాళ్ళల్లో యిద్దరు హైస్కూల్లోనూ, యిద్దరు ఎలిమెంటరీ స్కూల్లోనూ చదువుతున్నారు. వాళ్ళు నేలపైన నడవరు. నెల కొక్కింటికీ స్కూళ్ళకు పోవడానికీ రావడానికీ జట్కాల కింద చెల్లుతున్న డబ్బు ముప్ఫై రూపాయలు. ఈ వూళ్ళో వున్నవి మూడు థియేటర్లు. వాటిల్లో కొత్త ఆట ప్రారంభమయిన రోజున మొదటి తరగతి సోఫాలను అలంకరించేవారు చిరంజీవులతో సహా శ్రీవారి జనానావారు. కోట రంగయ్యగారి బట్టలకొట్టు మీకు సుపరిచితమే ననుకుంటాను. ఆ కొట్టులో ఖాతా పుస్తకాలు తిరగవేసి చూడగలరా మీరు! దొరగారి బేరసారాలు ఎంత పెద్ద ఎత్తున జరుగుతున్నాయో చూస్తే తెలుస్తుంది. ఇదిగాక ఈయనగారి భౌతిక శరీరంలోని జీవకళను బ్లాటింగు పేపరులా పీల్చివేస్తున్న దొకటి వుంది. 'డయాబెటీస్!' వారానికి మూడు చొప్పున ప్రతినెలా పన్నెండు విలువైన యింజక్షన్లతో దానికి సపర్య జరుగుతోంది. ఎరుగుదురా మీరు! నేను నిత్యావసరాల సంగతి అలా వుంచి పైపై ఖర్చులనుగురించి మాత్రమే ప్రస్తావిస్తున్నాను. ఎక్కడనుంచి వస్తోంది డబ్బు? ఏమి టీ చిదంబర రహస్యం? వివరాలు నేను చెప్పను. ఐనా యివి మూకిట మూసిపెడ్తే దాగే సత్యాలు కావు. కాగల కార్యం గంధర్వులే నిర్వర్తిస్తారు...."

ఆ గంధర్వులు ఏ రూపంలో అవతరించబోతున్నా రన్న ప్రశ్నకుగూడా అనతికాలంలోనే సమాధానం లభించింది. స్థానిక వార పత్రిక 'బజావో ఢంకా'లో గుసగుసల శీర్షిక కింద టుమ్రీలాంటి వార్త ఒకటి ప్రచురింపబడింది.

"అధికాహా రోత్పత్తి ప్రణాళిక క్రింద రైతుల కిస్తున్న

అప్పులలో నుంచి గ్రామోద్యోగుల ద్వారా మితి మీరిన మామూళ్ళు గుంజుకొంటూ, చెరువు కంట్రాక్టర్లతో మంతనాలు సల్పి చెక్కు మార్చుకోగానే పర్సంటేజి లెక్కన జేబులు నింపుకుంటూ, అధికార దర్పంతో మన్నూ మిన్నూ గానక క్రింది వారిని నోటికొచ్చినట్లల్లా తూలనాడుతూ ఒక పెద్ద వుద్యోగి సాగి స్తున్న గుడ్డిదర్బారువల్ల విముఖత్వాన్ని ప్రకటిస్తూ అర్జీలు తోకలేని పిట్టలై జిల్లా హెడ్‌క్వార్టర్సుకు, రాష్ట్ర ముఖ్యనగరానికి పరతెంచి పోతున్నాయనీ, పాములు కప్పల్ని బట్టి మ్రింగినట్లుగా ఎవరి పాపాలు వారినే మ్రింగుతాయన్న పెద్దలమాట పరమసత్యం గనుక త్వరలోనే అతని పాపం పండకపోదనీ ఎన్. జి. వో.ల క్లబ్బు వెనుక వేప చెట్టుమీద కాపురమున్న కపోతమిథునంలో పోతుపక్షి పెంటిపక్షితో గుసగుస లాడుతోందన్న వార్త యింకా మీ చెవిదాకా రాలేదా?''

అంతవరకూ చెవిదాకా వచ్చినా రాకపోయినా పత్రికలో పడిన తర్వాత ఆ వార్తకు ప్రాణం వచ్చింది. ఎనభైనాలుగులక్షల జీవరాసులలో అగ్రగణ్య మనిపించుకున్న మానవజాతిని గురించి దిక్కుమాలిన పక్షులే మాట్లాడుకుంటూవుండగా తాము వూరుకోవడం ఏ మాత్రమూ న్యాయం కాదన్నట్టుగా పదిమంది గుమిగూడిన ప్రతి చోటా యిదే చర్చ ప్రారంభమైంది!

శేఖరంగారు మాత్రం మామూలుగా ఆఫీసు కొస్తున్నారు, వెళ్తున్నారు. కాని ఆయన మునుపటి మనిషి కాదు. ఇప్పుడు పిలుపులు లేవు. కాలింగ్‌బెల్ శపిస్తో మ్రోగదు. లోపలికి వెళ్ళిన కాగితాలు సంతకాన్ని నమోదు చేయించుకుని తిరిగి రావడం మినహాయిస్తే ఆఫీసు తాశిల్దారుగారి అజమాయిషీ క్రింద పని చేస్తున్న దనడానికి నిదర్శనాలే లేవు.

నిజానికి ఈ పరిణామాన్ని సాధించిన ఘనత ఏ ఒక్కరిదీ కాదు. అప్రతిహతమైన దైవసంకల్పం ఎదుట ఘోర పరాజయం పాలైన మానవ ప్రయత్నానికి ఉదాహరణగా కనిపించేవారు శేఖరం గారు. పత్రికలో కెక్కిన వార్తలు, పదిమందిలో చెలరేగిన సందే

షోలు, పైవారిలో వేరూనుకున్న అనుమానాలు యివన్నీ కలిసి కట్టుగా రూపొంది ఈ మార్పును సాధించి వుంటాయనుకున్నట్టయితే ఆ వూహ సత్యానికి వ్యతిరిక్తంగా, సమీపంగా వుండవచ్చు. కాని ఈ సత్యానికి అవకాశం దొరికినప్పుడల్లా నరసింహానికి ధూపారాధన పట్టడం ప్రారంభమైంది. నరసింహం సామాన్యుడుకాడు. అతడు నిరంకుశ రాచరికాన్ని హతమార్చాడు! దాస్యనిగళాల్ని ఛేదించాడు. స్వాతంత్ర్యాన్ని స్థాపించాడు!

కాని నన్ను మాత్రం ఓ సందేహం బాధిస్తుండేది. ఎలాగైతే ఈ మూగతనం, ఈ పిరికితనం, ఈ స్తబ్ధత్వం శేఖరంగారికి జన్మతహా వచ్చిన గుణాలు కావో అలాగే ఆ ముక్కోపం, ఆ పెడసరితనం, ఆ విశ్శృంఖలత్వంగూడా ఆయనకు పుట్టుకతో వచ్చిన గుణాలు కావేమో! అవీ, యివీ గూడా శేఖరంగారి నిజమైన స్వభావాన్ని ఆవరించుకున్న చీకటి ముసుగులైతే, ఆ ముసుగులలోపలి శేఖరంగారు వస్తుతహా మంచివారేనేమో! కావచ్చు. అసలు మానవ స్వభావమే ఒక ముడిపదార్థం. పరిస్థితుల ప్రభావంగాని, పరిసరాల ప్రాబల్యం గాని ఆ ముడిపదార్థాన్ని యిచ్చవచ్చినట్టల్లా మార్చివేసే రసాయనిక ద్రవ్యాలు. ఈ మార్పులకు అతీతంగా నిలబడగలగడం మానవాతీతుని లక్షణమైతే కావచ్చుగాని మానవమాత్రుని తరంమాత్రం గాదు.

శేఖరంగారు మానవాతీతుడు గాదు. మానవసామాన్యుడు.

శేఖరంగారి గత జీవితాన్ని గురించి నాకు తెలిసిన వివరాలు తక్కువ. బొత్తిగా ఏమీ తెలియదన్నా తప్పుగాదు. కంటికి కనిపిస్తున్న కార్యాలకు వెనుక కంటికి కనిపించని కారణాలను వూహించుకోగలిగినప్పుడు మాత్రమే ఒక మనిషిని స్పష్టంగా అర్థం చేసుకోడానికి వీలుంటుంది.

నేను శేఖరంగారిని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాను. కాని నా ప్రయత్నం ప్రయత్నంగా వుండగానే శేఖరంగారి కథ శరవేగంతో పరుగుదీసి ముందుకు సాగలేక మండుటిసుకలో యింకిపోయిన ప్రవాహంలా ఆఖరుకు ఒక స్మృతిగా మిగిలిపోయింది!

* * *

కాలాన్ని నదీప్రవాహంతోనూ, మానవజీవితాన్ని నౌకాయానంతోనూ వుపమిస్తే విధి వక్రించి వెక్కిరించి వికటాట్టహాసం సలిపే సంఘటనలే సుడిగుండాలు. ఆలాటి సుడిగుండంలో శేఖరంగారొక పూచిక పుల్లలా గిరవాట్లు కొడుతుండగా నేను చూచాను. ఆ దృశ్యం కళ్ళబడేదాకా ఆయనను చుట్టుముట్టిన విషమ విపత్కర విపరీత పరిస్థితు లెలాటివో నేను పోల్చుకోలేకపోయాను.

ఓ రోజు సాయంత్రం అయిదుగంట లప్పుడు తాశీల్దారుగారు పిలవనంపారు. తీసుకరమ్మన్న కాగితాలతోసహా గదిలో ప్రవేశించాను. ఈమధ్య నేను శేఖరంగారిని బాగా పరకాయించి చూడడం తటస్థించలేదు. గుంటలు పడిన కళ్ళు, పైకి లేచిన నుదురు, చప్పిడి దవడలు - ఆ ఆకారంలో మానవుడైన శేఖరంగారు మరుగుపడిపోతున్నారు. పండ్రమాగి, ఎండిపోయిన జిల్లేడు ఆకులా పాలిపోయిన ఆ ముఖంలోనుంచి ఓ ప్రేతం తొంగిచూచినట్లయి, నేను టేబిలుకు కొంచెం దూరంలో చేష్టలు దక్కి స్థాణువునై నిల్చుండిపోయాను.

శేఖరంగారు ఓ ఫైలు నంబరు వుదాహరించి దానిపైన నేను తీసుకున్న చర్య ఏమిటో వాకబు చేశారు.

"అది రెండు మూడేళ్ళుగా పేరుకుపోయిన ఫైలుసార్! తీరిగ్గా చదివి అర్థం చేసుకోవాలి" అన్నాను.

"అబ్బే, వీల్లేదు రాజూ! రిమైండర్లకుపైన రిమైండర్లు వచ్చి పడుతున్నాయి. ఈ రోజుకూడా ఒకటి వచ్చినట్టుంది. ఎలాగైనా రేపు డెస్పాచ్ చేసేయాలి!"

"ప్రయత్నిస్తాను సార్! ఇంటికి తీసుకెళ్ళి రాత్రంతా మేలుకునైనా చదివి ముగిస్తాను."

"కాని రేపు నేను క్యాంపు వెళ్తున్నాను...." కాసేపు ఆలోచించి "నువ్వొక పని చేయగలవా రాజూ! రేపు వుదయం తొమ్మిది గంటలకు నువ్వు నన్నింటిదగ్గర కలుసుకోవాలి. సంతకంపెట్టి క్యాంపుకు వెళ్తాను" అన్నారు శేఖరంగారు.

"అలాగేనండీ!" అని సెలవు తీసుకున్నాను.

మరునాటి ఉదయం తొమ్మిది గంటలకల్లా నేను తాశీల్దారు గారి యింటి ముంగిట హాజరుగా వున్నాను. మాటలుగా పాటలుగా నవ్వులుగా కేరింతలుగా అలికిడైతే వినిపిస్తోందిగాని మనుషుల పొల కువమాత్రం కనరావడంలేదు. గంట తొమ్మిదిన్నరగూడా దాటింది. ఇంకా తామసించడానికి మనస్కరించక మెల్లగా వరండా దాటుకుని వెయిటింగు రూము చివరనుంచి హాల్లోపలికి చూశాను!

ఇంద్ర ధనుస్సులోని రంగుల్ని కలగాపులగంచేసి చిమ్మన గ్రోవితో వెదజల్లినట్టుగా గోడల నిండుకూ కాలెండర్లు వ్రేలాడు తున్నాయి. క్యాలెండర్ల పై కెక్కి బొమ్మలై కూర్చున్న కుటిలాల కలు, హరిణేక్షణలు, మృగరాజ మధ్యలు తమతమ వీలునుబట్టి నృత్య భంగిమలో నిల్చుని తిండికంటే,నీళ్ళకంటే స్నోలు,పౌడర్లు, సబ్బులు, తల నూనెలే ప్రాణావసరాలని హితబోధ గావిస్తున్నారు. హాలుమధ్య నేలపైన పడివున్న ట్రంకులూ, సూట్ కేసులూ,చేతిసంచులూ ప్రయాణ సంరంభాన్ని సూచిస్తున్నాయి.

"ఎవరండీ? ఏం కావాలి?"

ఉలికిపడి తల పైకెత్తాను. తల పైకెత్తిన క్షణంలో నా కళ్ళకొక మంచు శిఖరం కనిపించినట్టుతోచింది. ఆవిడ కట్టుకున్నది మంచు కంటె తెల్లని చీర. జానెడు వెడల్పుతో ఎర్రటి బార్డరు చీర వెంబడీ శరీరం చుట్టూ వంకరలు తిరుగుతోంది. సరిగపోగులు పూవులై పూచి,కాయలై కాచి చిన్న పూలతోటలావున్న పమిట చెరగు గాలిలో రెపరెప లాడుతుండగా ఆవిడ మెట్లు దిగుతోంది.

"మరేం లేదండీ! తొమ్మిది గంటలకు నన్ను రమ్మ న్నారు...."

"రమ్మన్నారు. తనేమో క్యాంపుకు వెళ్ళిపోయారు.పోనీలెండి! మీరు రావడం గూడా ఒకందుకు మంచిదే అయింది. కూర్చోగలరా కాసేపు! కాస్త పనుంది."

కూర్చోకేం చేస్తాను! ఆ మాటల ధోరణి అలాంటిది. క్రొత్త

పాతల తారతమ్యమేమీ ఆమెకు కాబట్టినట్టులేదు. ఆమె కేదో పనుంది. ఆ పనిని చేసిపెట్టడానికే నే నక్కడ ప్రత్యక్షమై వుంటానని ఆమె వుద్దేశించింది.

"ఏమంత పెద్దపనికాదు లెండి! స్టేషను దాకా వచ్చి మమ్మల్ని రైలెక్కించాలి."

"జట్కా తీసుకరమ్మంటారా?" అన్నాను.

"ఉండండి మరి. కొంచెం నిదానించాలి. జట్కా గాకపోతే ఈ వూళ్ళో టాక్సీలు దొరుకుతాయా యేమన్నానా! అందుకే వద్దు బాబో ఈ వూరు అని మొత్తుకున్నాను. రైలు పదకొండు గంటల కంటే, పదికే యిల్లు వదలాలి. రెండు మైళ్ళ దూరం జట్కాలో కూర్చుంటే ఒళ్ళంతా ఒక వరుస హూనమై పోతుంది...."

"కాని, ఆ రైళ్ళకంటే ఈ జట్కాలే నయం కదండీ! రైల్లో ఒక్కొక్కప్పుడు నిల్చోడానికైనా తావుండదు."

నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఆమె "నిల్చోడ మేం కర్మ మండీ! ఫస్టుక్లాసు కంపార్టుమెంటు యింటికన్నా హాయిగా వుంటుంది. మీరు అప్పుడప్పుడూ నిల్చునిగూడా ప్రయాణాలు చేస్తారా ఏమిటి?" అంది.

నా మట్టుకు నేను యీహానికీ పరానికీ సరిహద్దు గీతలాంటి ఫుట్ బోర్డుపైన నిల్చున్న ప్రయాణాలు గూడా వున్నాయి. కాని ఆ ప్రయాణానుభవాలను నివేదించుకునే చొరవగాని వ్యవధిగాని నాకు లేకపోయింది.

"ఆయ నలా వెళ్ళగానే పోస్టుమేన్ వచ్చి ఓ వుత్తరం పడేసి పోయాడు. 'కృష్ణుడికి పుట్టినరోజు. నువ్వు తప్పకరావాలి. మీ అమ్మ గూడా'రాజేశ్వరి లేకపోతే పండగ పండగగా వుండ'దని చెబుతోంది' అంటూ నాన్నగారు వ్రాశారు.తాళంచెవి ఎవరిదగ్గర యిచ్చి వెళ్ళడమా అని ఆలోచిస్తుండగా మీరు కనిపించారు...."

"అమావ్! నా బ్లూ కలర్ షిఫాన్‌చీర ఏదీ? బీరువా అంతా వెదికేశాను. కనబట్టంలేదు"

ఈ సారి పైకి చూచేసరికి చీరకట్టుకున్న చెరకు గడలా ఓ అమ్మాయి దృగ్గోచరమైంది. ఈ వుపమానానికి వీలైనంత న్యాయం చేకూర్చడానికి అనువుగా ఆమె గుబురుగా పెరిగిన చెరకు సోగలకు మల్లే శిరోజాలను గూళ్ళుగూళ్ళుగా అమర్చుకుంది. గరిమనాభి నుంచి వస్తున్న సరళరేఖ ఆధారతలంలో పడడం లేదేమో,ఆమె ఒక్కొక్క మెట్టు దిగినప్పుడల్లా ఒక్కొక్క రకంగా వంపులు తిరిగిపోతోంది.

"నీ బట్ట లెక్కడుంటాయో నీకే తెలియకపోతే ఎలాగే విమలా! ఆ పెట్టెలో వుంటుంది చూడు...."

విమల పెట్టె తెరిచి ఒళ్ళు అయ్యీకాకుండా చేతికి దొరికిన చీరలూ చోళీలూ చెల్లా చెదరుచేసి వెదకి వెదకి వేసారిపోయినట్టుగా "నాలుగు రోజులుండి రావడానికి యిన్ని బట్టలెందుకే అమ్మా! నువ్వు మరీను!" అంటూ సోఫాలో సోలిపోయింది.

"ఓసి నీ యిల్లు బంగారంగానూ! చూచారటండీ! ఇది వట్టి పిచ్చిమాలోకం. మనమేమీ పెట్టెల్ని మోసుకెళ్ళడం లేదుగదా! ఇక మరి యింట్లోవున్న బట్టలన్నీ తీసుకెళ్తే మాత్రం పోయే దేముంది? నిజం చెప్పొద్దూ, మా వదినె కొకపే తెగనీలుగు! ఏమంటే తనకొక పెట్టె నిండుకూ బట్టలున్నాయని! అందుకని ఓ రోజు నే నన్నాను గదా—'ఏమమ్మో వదినా! రెండు బీరువాలు చాలడంలేదు మాకు! మూడోదానికి ఆర్డరిచ్చాము'. అన్నానా, ఆవిడగారి ముఖం చింతా కంతైపోయింది!"

రాజేశ్వరమ్మగారు గుక్క తిప్పుకోకుండా నవ్వసాగారు. గడచిన పది పదిహేను నిమిషాల్లో ఆ నవ్వు ఒకటి రెండుసార్లు నాకు పరిచితమే. కాని అబ్బుర మేమిటంటే విమల అన్న చిన్నపేరుతో వ్యవహరింప బడుతున్న ఆ సన్నటి అమ్మాయి గూడా గాలివానలో వెదురుబొంగులా వూగిపోతూ నవ్వసాగింది. అది బండరాతిపైన గండశిల దొర్లుతున్నట్టున్న నవ్వు. ఇది కంచు పాత్రలో గులకరాళ్ళు వేసి గిలకరించినట్టున్న నవ్వు.

"అంతే కాదండోయ్! ఇక్కడ మా అనసూయను గురించి

కొంచెం చెప్పాలి. అనసూయంటే మా అందరిలోనూ కడగొట్టు అమ్మాయన్న మాట! దాని మొగుడు పేరుకు పెద్ద ఆఫీసరు. కాని దానికి పట్టుమని పదిచీరలుండవు. ఈ పెట్టెలతో, ఈ సరంజామాతో నేను దిగితే చాలు, అది కుళ్ళి చస్తుంది."

"అవునే అమ్మా! పాపం, అనసూయ పిన్నిని చూస్తుంటే జాలేస్తుంది...."

"నీ జాలికి వేళా పాళా లేదుగాని రవి ఎక్కడ? మురళి ఏమయ్యాడు? ఆ గోలీ కాయలు పంచుకోడం యింకా తెమల్లేదేమో వాళ్ళకు! అన్నట్టు ఆ శంకరంగాడు ఎంతకూ తిరిగిరాడే!"

"నాకు వెయ్యేళ్ళాయుస్సు! తలచుకుంటూ వుండగానే వచ్చేశాను" అంటూ రెక్కలల్లార్చుకుంటూ క్రిందికి వ్రాలుతున్న గరుటామంతుడిలా చేతు లాడించుకుంటూ రంగంలో దూకాడు శంకరంగాడు.

వచ్చినవాడు వచ్చినట్టుండకుండా గసపోసుకుంటూ ప్రారంభించాడు: "అమ్మో, ఆండాళమ్మగారంటే ఏమిటో అనుకున్నాను. వెయ్యి ప్రశ్న లడిగిన తర్వాతగాని పెట్టె తెరిచింది గాదు. అవసరంగా వూరికెళ్ళాలి. నాన్నగా రూళ్ళోలేరు. అందుకని...."

రాజేశ్వరమ్మగారు చూపులతో వారించారు. సైగలుచేసి చూశారు. కాని కుర్రాడు తన యింగితాన్ని గ్రహించే స్థితిలో లేక పోవడంతో రెక్కపట్టుకుని వాడిని బరబరా గదిలోకి లాక్కెళ్ళారు.

ఈ విచిత్ర ప్రపంచంలో ఎవరి గొడవ వాళ్ళది. వెళ్ళినపని దిగ్విజయంగా నెరవేర్చుకొచ్చేశామన్న సంబరం కుర్రవాడికి! వాడు అప్పుకోసం వెళ్ళివచ్చిన విషయం నాకు తెలియగూడదన్న ఆరాటం రాజేశ్వరమ్మగారికి!

ఇక జట్కా తీసుకరావడ మొకటే తరువాయి. రాజేశ్వరమ్మగారు హెచ్చరించక మునుపే వీధిలోకి వెళ్ళి జట్కాలు తీసుకొచ్చేశాను.

ఆ రోజు రైలు అరగంట ఆలస్యంగా వచ్చింది. ఆ అరగంటలో రాజేశ్వరమ్మగారి ద్వారా నాకు బోలెడన్ని విషయాలు తెలి

శాయి—ఆమె నాన్నగారు సబ్ కలెక్టరుగా పనిచేసి ప్రస్తుతం పింఛను పుచ్చుకుంటున్నారు. అన్నగారు లంకభూముల్లో పొగాకు పండిస్తున్నాడు. అతడొక్కడే నలుగు రైదుగురు ఐ. ఏ. యస్. ఆఫీసర్ల పెట్టు. తమ్ముళ్ళలో ఒకడు అడ్వొకేటు. అతడు వెయ్యిరూపాయలకు తక్కువ కేసైతే గుమ్మందాటి ఈవలికి రానివ్వడు. చిన్నతమ్ముడు డాక్టరు. అతడు వరకట్నంతో ఫారిన్ గూడావెళ్ళి కొత్త కొత్త వ్యాధుల్ని నయం చేయడంలో తరిబీదుపొంది వచ్చాడు. పోగా అన్నదమ్ముళ్ళకు తగ్గట్టు అక్క చెల్లెళ్ళుగూడా ఆ ఫాయాలోనే బ్రతుకుతున్నారు. పెద్దచెల్లెలి భర్తకు బస్సులున్నాయి. చిన్నచెల్లెలి మొగుడికి బస్సులు లేవుగాని మోటారు సైకిలుంది. అతడు గొప్ప యింజనీరు. ప్రభుత్వం ఆతడు కట్టమన్నచోట ప్రాజెక్టులు కడుతుంది. వద్దంటే మానేస్తుంది.

అదృష్టవశాత్తూ, అరగంట ఆలస్యం అయినప్పటికీ రైలు రానే వచ్చేసింది!

స్టేషనునుంచి సరాసరి ఆఫీసుకు వెళ్ళాను. జట్కాలో కూర్చున్నందుకు కాదుగాని గడచినరాత్రి సరిగా నిద్రలేక ఒళ్ళంతా నలతగావుంది. సెలవుపెట్టి యింటికివెళ్ళాను. భోజనంచేసి పడుకోగానే గాఢంగా నిద్రపట్టింది.

నిద్రలేచేసరికి జానకి పట్టుచీరలో ముస్తాబై, "అమ్మవారికీ రోజు పచ్చలహారం వేస్తారటండీ! పొరుగింటి పిన్ని రమ్మంటోంది. వెళ్ళొస్తాను" అంది.

"ఐతే ఒకపని చేద్దాం, జానకీ! ఎలాగూ నీకు హిందీ సినిమాలు నచ్చవు. నువ్వు గుడికివెళ్ళు. నేను సినిమాకు వెళ్ళొస్తాను" అన్నాను.

కలతలను పరిహరించి మనసు కొక్కింత వుల్లాసాన్ని చేకూర్చి పంపగలదనుకున్న సినిమాగూడా ఆ రోజు నా వూహకు తల్లక్రిందులుగా పరిణమించింది. చలన చిత్రాల పాలిటి మహారాజపోషకులైన పావలా టిక్కెట్టు ప్రేక్షకుల పరిభాషలో అది ఏడ్చి

ముఖం కడుక్కున్నట్టుగా వుండడంతో ఎప్పటికప్పుడే లేచి రావాలనుకుని ఓపికలేక అలాగే కూర్చుండిపోయాను. వెండితెరపైన సినిమా కథ తన కిష్టంవచ్చినట్టల్లా పారిపోతుండగా, కనురెప్పలమీద నిద్రా దేవత ఆనందలాస్యం సలుపుతుండగా, ఆ కథకూ ఈ నిద్రకూ మధ్య బెంచీలోని నల్లులు మధ్యవర్తిత్వం నెరపుతుండగా ఆట ముగిసింది.

అమావాస్య చీకటి. అందుకు తోడు ఆకాశాన మబ్బులు పడయాడుతున్నాయి. ఎడారిలాంటి చీకటిలో వెలుగు ఒయాసిస్సులను ప్రసవించలేక వీధి దీపాలు సైతం వెల వెల పోతున్నాయి.

దూరం కాస్త కలిసివస్తుందని సందుగొందుల్లోపడి నడువ సాగాను. ఇళ్ళలోపల వుక్కకు తట్టుకోలేక వీధుల్లోనే బిచాణా పరచుకున్న పురజనుల మధ్యనుంచి త్రోవచేసుకుని చర చరా నడచి పోతున్నాను. ఉన్నట్టుండి ఒకచోట అనుకోని అవాంతర మొకటి ఎదురైంది. సైడుకాలువలో షికార్లు తిరుగుతున్న కుక్కలు కొన్ని మొరుగుతూ పైపై కొచ్చేశాయి. దిక్కులు దోచక ఆ సందులోనుంచి వేరొక సందులోకి దారితీశాను. దూర్వాసుని వెన్నంటిన విష్ణుచక్రం లాంటి జాగిలం ఒకటి నేను పరుగుదీస్తే అదీ పరుగుదీసి, నే నాగి పోతే అదీ ఆగిపోయి చివరకు నన్నొక తారురోడ్డుపైన దిగవిడిచి మాయమైపోయింది.

పట్టణంలో ఏ భాగంలో వున్నానో తెలుసుకోగోరి తల పైకెత్తి చుట్టూరా కలయజూచాను. ఎట్ట ఎదుట తాశీల్దారుగారి మేడ. మేడ పైన గదిలో వెలుగుతున్న దీపం. దీపకాంతి కడ్డంగా కిటికీ చువ్వలకు ఆనుకుని నిల్చున్న సిల్హౌట్టులాంటి నీడ!

నా చేయి అప్రయత్నంగా జేబులోకి వెళ్ళింది. అక్కడ రాజేశ్వరమ్మ గారిచ్చిపోయిన తాళం చెవి భద్రంగావుంది.

గేటు తెరచుకుని గబగబా లోపలికి వెళ్ళాను.

"ఎవరూ, ఎవరూ" అన్నారు శేఖరంగారు.

"నేనే నండీ! రాజుని. తాళంచెవి నాచేతి కిచ్చిపోయారు.

పొరబాటుజరిగింది. మీ రీ రోజే క్యాంపునుంచి తిరిగివస్తారనుకో లేదు....''

నీడలాంటి శేఖరంగారిలో చలనంలేదు. కనీసం నా మాట లాయనకు అర్థమైన సూచనలుగూడా లేవు.

ఒకటి రెండు నిమిషాలు అలాగే గడచిపోయాయి.

''వెళ్ళమంటారా సార్!'' అన్నాను.

శేఖరంగారు గిరుక్కున వెనుదిరిగి కనుమరుగైపోయారు. మరికొంత సేపటికి క్రింద తలుపుతీసిన శబ్దం వినిపించింది.

తలుపు తెరచుకుని నేను హాల్లోపలికి వెళ్ళేసరికి శేఖరంగారు మేడ మెట్లెక్కుతున్నారు. కాలికేదో తగలడంతో క్రిందికి చూచాను. విరిగినతాళం!

మెట్లెక్కి నేనూ గదిలో ప్రవేశించాను.

ఆ గదిలోని వస్తువులన్నీ చిందరవందరై పోయివున్నాయి. శేఖరంగారి ప్యాంటూ, కోటూ మంచానికి అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఆయన ఓ లుంగీ చుట్టుకున్నారు. బనీను వేసుకున్నారు. కుర్చీలో కూర్చుని టేబిలుపైకి వ్రాలిపోయి వ్రేళ్ళతో జుత్తు పీక్కుంటున్నారు.

కోప్పడుతుండగా నేను శేఖరంగారిని చూచాను. చిరాకుతో చిడిముడిపాటు పడుతుండగా నేను శేఖరంగారిని చూచాను. దాదాపు ఒక్క సంవత్సరంనుంచి వెయ్యిరకాలైన భావావేశాలు శేఖరంగారి ముఖంలో రంగులు మార్చుకుంటూ వుండగా నేను చూచాను. కాని యిలాంటి పరిదీన పరిస్థితిలో మాత్రం నేనెన్నడూ ఆయనను చూడ లేదు. లాఠీలతో చితక బొడిచిన తర్వాత, కమ్చీలతో వాయించిన తర్వాత బాధకు నిభాయించుకోలేని ఖైదీలా ఆయన పళ్ళు బిగకరచు కుని, కళ్ళు కుంచించుకుని కుత కుతమని వుడుకుతున్న కూరాకులా కూర్చున్న కుర్చీలో క్రుంగిపోతున్నారు.

''ఇదేమిటిసార్! ఇలాగైపోతున్నారెందుకు? ఏం జరిగింది?'' అంటూ దగ్గరగా వెళ్ళి నిల్చున్నాను.

శేఖరంగారు లేచి నిటారుగా కూర్చున్నారు. నా కళ్ళల్లోకి

సూటిగా చూస్తూ "పాపం బ్రద్దలుకావడమంటే ఏమిటో నీకు తెలియదా రాజూ?" అన్నారు. అనడమేమిటి? ఆక్రోశించారు.

"ఏదో చిన్న విషయానికి మీ రిలా బేజారుపడిపోతున్నారు. మరేం ఫరవాలేదు. కాసేపు నెమ్మదిగా మంచంపైన పడుకోండి." అన్నాను.

"రాజూ!" లేచి నిల్చున్నారు శేఖరంగారు. చేయిపట్టుకుని నన్ను కిటికీ దగ్గరకు తీసుకెళ్ళారు. "చూడు. తెలియటంలేదూ? అతడెవరో నీకు తెలియడంలేదూ?" అంటూ గోడ ప్రక్కకు తప్పుకున్నారు.

రోడ్డు కటువైపున ఓ చిన్నబంకు. బంకుకెదురుగా ఓ బెంచీపైన కూర్చుని ఓ బక్కపలచటి పెద్ద మనిషి ఎత్తిన తల దించకుండా ఈ కిటికీవైపే చూస్తున్నాడు.

"చూచావా రాజూ! అతడెవరో నిన్నటివరకూ నాకూ తెలియదు. ఈ రోజే తెలిసింది. ఉదయంనుంచీ ఆతడు నన్ను వెంటాడుతున్నాడు. జవాను పుల్లయ్యను దూరంగా పిలిచి మూడు సార్లు వాకబుచేశాడు. అతడు సి. ఐ. డి. ముందుగా వచ్చేశాడు. అతడి వెంబడే వారంటు వస్తుంది. తెలిసిందా రాజూ! పాపం బ్రద్దలు కావడమంటే ఏమిటో తెలిసిందా రాజూ?

"నా పాపాల జాబితా చాలా పెద్దది." మళ్ళీ కుర్చీలో కూలబడి చెప్పుకపోసాగారు శేఖరంగారు. "ఒడ్డు చేరుకున్న తర్వాత తెప్పను ముక్కలు ముక్కలుచేసి తగలబెట్టిన పాపం కట్టికుడుపక మానేదిగాదు. పందిరిపైకి ప్రాకబోతున్న పూలతీవెల్లాంటి అనురాగాల్నీ, మమకారాల్నీతెంపి, బ్రోగులుపోసి కాలరాసి నేలపాలుచేయడం కన్నా దారుణం మరేముంటుంది రాజూ? ఒకటికాదు, రెండుకాదు; నిండుగా పదిహేనేళ్ళనుంచి నేను ఆజ్యంపోసి అగ్నిగుండానికి కాస్త ఉపశాంతి కలిగించాలని ప్రయత్నిస్తున్నాను. కాని ఆజ్యం పోసినకొద్దీ అగ్ని నాలుకలు సాచుకుని మరింతగా ప్రజ్వరిల్లిపోతోంది. ఆ మంటలు గూడా నా అంతాన్ని కనుక్కోకుండే వదలిపెట్టేవిగావు. కాని నా పతనానికి నేను మానవుల్ని హేతుభూతులుగా పేర్కొనడం లేదురాజూ!

జలగలై నా శరీరంలోని నెత్తురును పీల్చి వేసినవీ, జ్వాలలై నా మనశ్శాంతిని మాడ్చివేసినవీ, ఈటెలై నా అంతరాత్మను గ్రుచ్చి గ్రుచ్చి బాధిస్తున్నవీ నా పాపాలు....''

కుర్చీలో కూర్చోలేక తూలుతూ పైకిలేచి శేఖరంగారు కుప్ప కూరలా మంచంపైన కూలిపోయారు.

నేను కాసేపు గదిలో పచార్లు చేశాను. స్టూలుపైన కూర్చు న్నాను. మళ్ళీ లేచాను. ఘరేం చేయడానికీ పాలుపోక గోడకు వ్రేలాడుతున్న ఫోటోలకేసి చూడసాగాను.

ఆ ఫోటోలలో ఒకటి నా దృష్టిని అరికట్టింది. ఎన్నడోగాని నే నా ఫోటోను చూచినట్టుగుర్తు....అవును. 'ఇతడేనండీ మా చంద్రం బావ' అంటూ జానకి ఒకసారి సరిగ్గా యిలాంటి ఛాయాచిత్రాన్నే చూపించింది.

కాని చంద్రం ఫోటో ఈ గదిలో ఎందుకు వ్రేలాడుతోంది?

వరుసగా అక్కడ తగిలించివున్న ఏడెనిమిది ఛాయా చిత్రా లనూ చూచిన తర్వాతగాని నాకు సందేహనివృత్తి కలుగలేదు. ఒక చోట చంద్రంలో శేఖరంగారి పోలికలు లీలగా కనిపించాయి. రాను రానూ ఆ పోలికలే స్థిరపడిపోయి అసలైన చంద్రం మనిషిలో మనిషిలా మటుమాయమైపోయాడు.

ఐతే ఈయన తన పేరులోని పూర్వభాగాన్ని 'సి' అన్న పొడి అక్షరంలో దాచుకున్న చంద్రశేఖరంగారన్న మాట!

ఎప్పుడు, ఎక్కడ, ఏ రూపంలో చంద్రాన్ని కర్కోటకుడు కాటువేశాడో నాకు తెలియదు. అతడి బాహుక స్వరూపమే శేఖరం గారు!

మంచంపైన ప్రక్కకు ఒత్తిగిల్లుతూ అన్నారు, శేఖరంగారు: ''ఇంకా యిక్కడే వున్నావా రాజూ! రాత్రి మీరిపోయినట్టుంది. వెళ్ళు బాబూ, నువ్వు వెళ్ళు!''

ఉంది చేయగలిగిందేమీలేక, ఉదయం కలుసుకుంటానని చెప్పి సెలవు తీసుకున్నాను. ఓదార్పు మాటలకన్నా యిప్పుడు శేఖరం

గారికి విశ్రాంతి అవసరం. నిద్రపోయి లేచినట్టయితే ఆయన మనసుకు కాస్త స్తిమితం చేకూరవచ్చు.

రోడ్డుపైకి వచ్చి పదిబారల దూరం నడిచానో లేదో వెనుక నుంచీ పిలుపు వినిపించింది.

"ఏమండీ సార్! ఒక చిన్నమాట...."

మరొకడూ మరొకడూకాదు. అతడు తాశీల్దారుగారిపైన నిగా పెట్టి తిరుగుతున్న బక్కపలచటి పెద్దమనిషి!

"మరేం లేదు. ఒక చిన్న యిన్‌ఫర్‌మేషన్ కావాలి. మీ వుపకారం మరచిపోను. తాశీల్దారుగారి ద్వారా నాకో సహాయం కావాలి. డబ్బుకు వెనకాడేవాణ్ణికాను. ఆయన్ను ఎలా అప్రోచ్ చేయాలో ఏమిటో ఆ విధానం నాకు తెలియడంలేదు...."

నాకు ఒళ్ళు మండింది. మాటలే మంత్రాలుగా ఎదుటి వారిపైన మచ్చుపొడి చల్లి తనకు కావలసిన రహస్యాలను ఆరాతీసే పరిశోధనా కౌశలమేమో యిది! 'నీ నక్కజిత్తులు నాదగ్గర సాగవు, పో' పొమ్మని దులిపివేద్దామనుకున్నాను. కాని అతడు సి. ఐ. డి. ఎట్టి పరిస్థితిలోనూ అతడితో వ్యవహారం శ్రేయస్కరంగాదు.

"చూడండి సార్! తాశీల్దారుగా రిలాంటి కాని పనులకు పూనుకుంటారని మీ కెవరు చెప్పారో నాకు తెలియదు. నాకు తెలిసినంతవరకూ ఆయన నిప్పులాంటి మనిషి! ఇదే మీకు నే నివ్వగలిగిన యిన్ఫర్మేషను."

అతడి నలా రోడ్డుపైన వదలిపెట్టి వడి వడిగా ముందుకుసాగి చీకటిలో కలిసిపోయాను. కాయం ముందుకు కదులుతున్నా ఆలోచనలు మాత్రం వెనక్కు వెళ్తున్నాయి. ఉండి వుండీ ఒక ప్రశ్న నా అంతరాంతరాల్లో ధ్వనిస్తోంది—వత్తి మండుతున్న చిమ్నీలో పడిపోయి, రెక్కలు రాల్చుకుని కొట్టుమిట్టాడిపోతున్న శలభంలాంటి శేఖరంగారు చివర కేమౌతారు?

పరిపరి విధాలైన ఆలోచనలు తేనెటీగల్లా వచ్చి ముసురుకుంటున్నాయి. కాని ఎంతగా ఆలోచించినా మానవుడి చూపు అనాగతంలోకి చొచ్చుకపోదు. ఒకవేళ చొచ్చుకపోయినా ఆ చూపుకు

వక్రీభవనం తప్పదు. శేఖరంగారికి విశ్రాంతి అవసరమనుకున్నప్పుడు ఆయన నిరంతరమైన విశ్రాంతినే వాంఛిస్తున్నారనిగాని, నెమ్మదిగా నిద్రపోయినట్టయితే ఆయన మనసుకు స్తిమితం చేకూరవచ్చు ననుకున్నప్పుడు ఆయన పాలిటి కిక మిగిలివున్నది దీర్ఘనిద్ర మాత్రమే ననిగాని నేను భావింపలేక పోయాను.

* * *

శేఖరంగారు తమ జీవిత నాటకానికి భరతవాక్యం చెప్పుకున్న వారం రోజుల కొకనాడు ఆఫీసునుంచి తిరిగివస్తుండగా మార్గ మధ్యంలో బక్కపలచటి సి. ఐ. డి. పెద్దమనిషి ఎదురయ్యాడు.

"ఏమిటండీ! తాశీల్దారుగారు పోయారటగా. చాలా విచారిం చాను...."

అతణ్ణి నమిలి మింగివేయా లన్నంతకోపం వచ్చింది. ఐనా తమాయించుకుని "ఏం చేయగలమండీ! ఆయన బ్రతుకలా తెల్ల వారింది" అన్నాను.

"మహానుభావుడు, నా కేపైనా కేసులు చూపిస్తాడేమోనని ఓ రోజంతా ఆయన్ను వెన్నంటి తిరిగాను. ఊరికే కాదనుకోండి, నా కొచ్చే కమీషనులో ఎంతో కొంత ముట్టజెప్పాలనే నా వుద్దేశం. జవానుతోగూడా ఒకటి రెండుసార్లు సంప్రదించి చూచాను. కాని అతడు గూడా నా కంతగా వుపకరించ లేకపోయాడు. పోనీ వూరంతా మాటు మణిగిన తర్వాత కలుసుకుందా మనుకున్నాను. మీరు వెళ్తూ వెళ్తూ వేరొకవిధంగా చెప్పిపోయారు. ఇంత చేశావా భగవంతుడా అనుకుని తిరిగి చూడకుండా యింటికి వెళ్ళిపోయాను...."

అతడి కేసులేమిటో, కమీషనేమిటో బొత్తిగా అంతుపట్టక "ఇంతకూ మీ వుద్యోగమేమిటండీ బాబూ! పోలీసు డిపార్టుమెంటు కాదూ మీది?" అన్నాను.

"బాప్బాబూ! నేను యిన్షూ్యరెన్సు ఏజంటుని! కావలిస్తే నా లెటర్‌ప్యాడ్ చూడండి!" అంటూ అతడు తన లెదర్ బ్యాగును తెరువసాగాడు.

★